# ఈనాడు సూర్యాపేట

ఆదివారం అక్టోబరు 4, 2026





## కాల్వే.. అడ్డా



నేరేడుచర్ల పట్టణంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి వెంట పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేసే వారు మురుగు కాల్వపై కొనుగోలు చేసిన పాత ట్రాక్టర్లు, నాగళ్లు, ఇతర బరువైన ఇనుప సామగ్రి పెడుతున్నారు. ఇప్పటికే పట్టణంలో పలుచోట్ల మురుగు కాల్వపై బిళ్లలు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నా.. అధికారులు మళ్లీ కాంక్రీట్ బిళ్లలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు మురుగు కాల్వలపై బరువైన సామగ్రి పెడుతుండటంతో కాల్వ దెబ్బతినే అవకాశం ఉంది. పురపాలిక అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదు. – న్యూస్‌టుడే, నేరేడుచర్ల

## అందాన్ని.. బంధించారు



వైబ్ ఉంది బేబీ.. వైబ్ ఉందిలే.. ఈ గ్లోబ్‌ను ఊపే వైబ్ ఉందిలే.. అంటూ మిరాయ్ సినిమా హీరోయిన్ రితికా నాయక్ నృత్యం చేసి యువతలో ఉత్సాహం నింపారు. కోదాడ పట్టణంలో శనివారం ఆమె సందడి చేశారు. యువత తమ మొబైల్లో ఆమె ఫోటోలను బంధించారు. – న్యూస్‌టుడే, కోదాడ

# నియంత్రిక.. నిలువలేక!

### అక్రమ వ్యవసాయ కనెక్షన్లతో అధిక భారం

ఆత్మకూర్(ఎస్) మండలం ఏనుబాములలో 100 కేవీఏ నియంత్రిక కింద 34 మోటార్లు వినియోగిస్తున్నారు. ఈ నియంత్రిక సామర్థ్యం 20 మోటార్లకే పరిమితం. మిగతా 14 అదనమే. అందులో పది అక్రమ కనెక్షన్లున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో నియంత్రికపై భారం పడటంతో లోవోల్టేజీ సమస్య ఏర్పడి మోటార్లు సైతం కాలిపోయే ప్రమాదముంది. ఇలాంటి పరిస్థితి జిల్లాలోని పలు చోట్ల ఉంది.

ఎల్‌నినో ప్రభావం నీటిపైనే కాకుండా విద్యుత్తుపైనా చూపుతోంది. వేసవిని తలపించే ఎండలకు ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం పెరిగింది. వర్షాలు ముఖం చాటేయడంతో అన్నదాతలు సాగు చేసిన పంటలకు సరిపడా నీరందించేందుకు బోరు మోటార్లను అధికంగా వినియోగిస్తున్నారు. ఈ కారణంగా విద్యుత్తు డిమాండ్ పెరగడంతో కోతలు కూడా విధిస్తున్నారు. పైర్లను కాపాడుకునేందుకు రైతులు ఒక్క కనెక్షన్‌కు అనుమతి పొంది రెండు మూడు మోటార్లు నడిపిస్తున్నారు. దీంతో నియంత్రికలపై భారంపడి రోజుకు పదుల సంఖ్యలో కాలిపోతున్నాయి. – భానుపురి, తుంగతుర్తి, నేరేడుచర్ల, న్యూస్‌టుడే:



సూర్యాపేటలోని మరమ్మతు కేంద్రానికి కాలిపోయిన నియంత్రికను తీసుకొస్తున్న సిబ్బంది

### సామర్థ్యానికి మించి మోటార్లు..

జిల్లాలో నియంత్రిక సామర్థ్యానికి మించి మోటార్లు పెడుతున్నారు. 25 కేవీఏ నియంత్రిక కింద ఐదు, 63కేవీఏకు 12, 100కేవీఏ పరిధిలో 20 మోటార్లు ఉండాలి. కానీ సామర్థ్యానికి మించి మోటార్లున్నాయి. దీంతో కరెంటు వాడకం అధికమై ఓవర్ లోడ్ పడుతోంది. ఫలితంగా సెప్టెంబరు నెలలో సూర్యాపేట డివిజన్‌లో 273, హుజూర్‌నగర్ డివిజన్‌లో 333 నియంత్రికలు కాలిపోయాయి. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టక అనధికార మోటార్లు పెరిగిపోతున్నాయి.

### వెంటనే మరమ్మతు చేపడుతున్నాం

– యాదగిరి, ఎస్ఈ విద్యుత్తు, సూర్యాపేట

జిల్లాలో ఓవర్ లోడ్ కారణంగా రైతుల నియంత్రికలు కాలిపోతున్న మాట వాస్తవమే. పంటలు ఎండిపోకుండా వెంటనే మరమ్మతు చేసి ఇస్తున్నాం. అవసరాన్నిబట్టి కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 40 వరకు నియంత్రికలను సిద్ధంగా ఉంచాం. కాల్వలకు నీరు రాక మోటార్లతో పంటలకు నీరందిస్తున్నారు. దీంతో విద్యుత్తు వినియోగం పెరుగుతోంది.



నేరేడుచర్ల మండలం దిర్శించర్లలోని మరమ్మతు కేంద్రానికి గడిచిన మూడురోజుల్లోనే కాలిపోయిన 17 నియంత్రికలు వచ్చాయి. సెప్టెంబరులో 68 నియంత్రికలు మరమ్మతుకు గురవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. సాగర్ కాల్వలకు నీరు రాకపోవడంతో ఆయకట్టులో మోటార్లపై ఆధారపడి వరిసాగు చేస్తున్నారు. ఇటీవల తెలగరామయ్యగూడెం ఉపకేంద్రం పరిధిలో బ్రేక్‌డౌన్‌తో రోజంతా విద్యుత్తు సరఫరాలేక రైతులు ఇబ్బందిపడ్డారు. నివారణకు ఉపకేంద్రాలలో అదనపు పీటీఆర్‌లను అమర్చాల్సి ఉంటుంది.




**ఒక్క రోజే పది:** తుంగతుర్తిలోని నియంత్రికల మరమ్మతు కేంద్రానికి శనివారం ఒక్క రోజే కాలిపోయిన పది నియంత్రికలు వచ్చాయి. వాటిని కేంద్రానికి తీసుకొచ్చి తిరిగి తరలించడానికి వారం రోజుల వుతూ పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయానికి వచ్చే త్రీఫేజ్ కరెంటు ఫుల్‌గా రావటం లేదు. లోవోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. 100 కేవీ నియంత్రిక కింద 18 మోటార్లే ఉన్నా కాలిందని అల్లునూరు రైతు పొడేటి వెంకటయ్య వాపోయారు.

| కనెక్షన్లు | సంఖ్య |
|---|---|
| గృహ | 3,36,177 |
| వ్యవసాయ | 1,62,499 |
| పరిశ్రమల | 49,065 |

# కాసులు ఇస్తేనే కానుక

### కల్యాణలక్ష్మి పథకంలో అక్రమాల పర్వం

సూర్యాపేట నియోజకవర్గంలోని ఓ యువకుడు, యువతి 2024లో వివాహం చేసుకున్నారు. వారు నెల రోజుల తరువాత కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకున్నారు. తమ తర్వాత దరఖాస్తు చేసుకున్నవారికి చెక్కులు రాగా.. వీరికి మాత్రం అందలేదు. ఈ విషయమై సంబంధిత రెవెన్యూ అధికారులను అడగగా. ..వారు ఓ వ్యక్తిని కలవాలని తెలిపారు. దీంతో సదరు లబ్ధిదారులు అతన్ని సంప్రదించగా.. రూ.10 వేలు ఇవ్వండి.. వెంటనే చెక్కు వచ్చేలా చూస్తానని చెప్పడంతో వారి అడిగినంత ఇచ్చుకుని మరుసటి నెలలో చెక్కు తీసుకున్నారు.

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిరుపేద ఆడబిడ్డలకు పెళ్లి కానుకగా ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం తొలుత ఎస్సీ, ఎస్టీ వధువులకు రూ.51 వేలు 2017 సంవత్సరంలో బీసీ, ఈబీసీలకు వర్తించేలా చేస్తూ రూ.75,116లకు పెంచారు. 2018 నుంచి రూ.1,00,116, వధువు దివ్యాంగురాలు అయితే రూ.1,25,145 చెల్లిస్తుండగా, మైనారిటీలకు షాదీముబారక్ పేరిట అందిస్తోంది. ఈ పథకాన్ని 2014 అక్టోబరు 2న ప్రవేశపెట్టగా శుక్రవారం నాటికి 12 సంవత్సరాలు పూర్తయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ పథకంపై హైకోర్టులో స్టే ఉండటంతో కొద్ది రోజులు నిలిపివేయగా సెప్టెంబరులో ఎత్తివేయడంతో తిరిగి ప్రారంభించారు.

**అమలు ఇలా..:** ఈ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ పత్రాలను తహసీల్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంది.



సంబంధిత దరఖాస్తును అధికారులు విచారణ చేపట్టిన తరువాత ప్రభుత్వానికి నివేదిస్తారు. ఈ వ్యవహారమంతా నెల నుంచి రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

**చేతివాటం:** అన్ని అర్హతలున్నా ఈ చెక్కులు మంజూరు కావాలంటే కొందరు తహసీల్ కార్యాలయం ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏ ఆటంకాలు లేకుండా సాఫీగా మంజూరు కావాలంటే ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు, కొందరు మీసేవ నిర్వాహకులను సంప్రదిస్తే చాలు సులువుగా పని అవుతుందన్న భావన ఆయా ఉద్యోగులు కలిగిస్తున్నారు. ముందుగా వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తేనే విచారణకు వస్తున్నట్లు తెలుస్తోంది. తక్కువ వయస్సున్న వధువులకు, అర్హతలు, నిబంధనలకు విరుద్ధంగా తల్లిదండ్రుల ఆదాయం ఉన్నా ఇవేవీ పట్టింపు లేకుండా మంజూరయ్యేలా చూస్తున్నారు.

| జిల్లాలో 2025-26లో వచ్చిన అర్జీలు.. | |
|---|---|
| దరఖాస్తులు | 124 |
| మంజూరు | 95 |
| నిధులు | రూ.96.75 లక్షలు |

### ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

– హరిసింగ్, అదనపు కలెక్టర్

కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. నేరుగా ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం.



## నిర్లక్ష్యమే..నీటికి అడ్డంకి

సూర్యాపేట పురపాలిక పరిధి పిల్లలమర్రి ప్రాంతంలో జడ్పీ ఉన్నత పాఠశాల పక్కన మూసీ కాలువపై ధ్వంసమైన కల్వర్టును ఇటీవల పునర్నిర్మించారు. కల్వర్టు నిర్మాణ సమయంలో కాలువ మీదుగా వాహనదారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా సిమెంటు పైపులతో తాత్కాలిక వారధి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనులు పూర్తయినా తాత్కాలిక బాటను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పంట కాలువలోని నీటి ప్రవాహానికి పైపులు, మట్టికట్ట అడ్డంకిగా మారింది. ఆ దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.
– ఈనాడు, నల్గొండ, న్యూస్‌టుడే, సూర్యాపేట గ్రామీణం.




# పాతాళగంగ.. ప్రమాద ఘంటిక

ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. గత నెలలో అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలు కాస్త ఉపశమనం కలిగించినా గతేడాది మాదిరిగా వరద పారలేదు. చెరువులన్నీ మత్తళ్లు పోయలేదు. భూగర్భజలమట్టం గతేడాది సెప్టెంబరుతో పోల్చితే ఈసారి లోతుకు చేరింది. ఇప్పటికే తగ్గుముఖం పట్టిన జలమట్టాలతో సాగు, తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే పేట ప్రజలు జలగండాన్ని ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
– ఈనాడు, సూర్యాపేట

**22 మండలాల్లో లోతుకు:** జిల్లా భూగర్భ జలశాఖ అధికారులు 23 మండల్లాలోని 50 ప్రాంతాల్లో బావుల్లో జలమట్టాలను సేకరించారు. వాటిని గతేడాది సెప్టెంబరులోని జలమట్టాలతో పోల్చగా జిల్లా వ్యాప్తంగా 4.83 మీటర్ల లోతుకు పడిపోయింది. మండలాల వారీగా పరిశీలిస్తే సూర్యాపేట మండలంలో 2.04 మీటర్లు పెరుగుదల కనిపించింది. 22 మండలాల్లో లోతుకు పడిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా, అత్యధికంగా తిరుమలగిరిలో 14.55 మీటర్లు, మేళ్లచెరువు 12.22, నూతనకల్ 12.27, చింతలపాలెం 11.83, ఆత్మకూర్(ఎస్) 10.50, జాజిరెడ్డిగూడెం 6.55, అనంతగిరి 6.43, మద్దిరాలలో 6.12 మీటర్ల చొప్పున పాతాళగంగ లోతుకు చేరడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.

జిల్లాలో సెప్టెంబరు నెలలో భూగర్భ జలమట్టాలు(మీటర్లలో)




**మేల్కొనకుంటే ముప్పు..:** ఇప్పటికే భూగర్భ జలం అడుగుకు చేరుతుండడంతో చాలా మంది రైతులు వేసిన పంటలను కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు. కొత్తగా బోర్ల తవ్వకం చేపడుతున్నారు. ఇక తాగునీటికి పట్టణాలు, పల్లెల్లో కష్టాలు మొదలయ్యాయి. సూర్యాపేట పట్టణంలోని ఇళ్లలోని బోర్లు సరిగా పోయని పరిస్థితి ఉంది. చాలామంది మోటార్లను ఎక్కువ సేపు నడిపించడం లేదు. పాతవి ఫ్లషింగ్, కొత్తబోర్లు వేయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు, అధికారులు మేల్కోవాల్సి ఉంది. కొత్తగా ఇంటి నిర్మాణదారులు తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మాణం చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా భూగర్భజలశాఖ అధికారి జ్యోతికుమార్ పేర్కొన్నారు.

**వానాకాలం లోటు:** ఈ సీజన్ సాధారణ వర్షపాతం 571.8 మి.మీ. కాగా నాలుగు నెలల్లో 439.1 మి.మీ. వర్షపాతమే కురిసింది. ఇది 23 శాతం లోటు. జిల్లాలోని 23 మండలాల్లో తొమ్మిదింట సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన 14 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ ప్రభావం భూగర్భజలమట్టాలపై ప్రభావం చూపింది.


**ANURAG PHARMACY COLLEGE**
(Approved by PCI, Affiliated to JNTUH)
Accredited by NAAC B++
Ananthagiri (Vill & mandal), Kodad, Suryapet (Dt.)
www.anuragpharmacy.ac.in Ph: 9553122271, 99899 76767

PHARMACY SPOT ADMISSION NOTIFICATION

| Pharma - D | B. Pharmacy |
|---|---|

Interested Candidates can attend the spot admissions with original certificates and prescribed fee for Pharm-D Rs.68,000/-, B.Pharmacy Rs.75,000/- on **06-10-2026 at 10 AM in** the college premises, Admissions will be made as per guidelines given by the Convener TGEAPCET - 2026.

**Note: -** Fee Reimbursement is not applicable to the candidates admitted under Spot Admissions.

Sd/- Principal



**MITS COLLEGE OF PHARMACY FOR WOMEN**
(Approved By PCI, New Delhi & Affiliated to JNTUH.)
Paleannaram (V), Chilkur (M), KODAD, Suryapet Dist.
Cell: 8309922949 & 9014107212

Notification for Spot Admissions in TGEAPCETB- 2026 into B.Pharmacy Course

Applications are invited from eligible candidates for the academic year 2026-27 Under A-Category seats (SPOT) for admission into the following 1st year B.Pharmacy course as per the vacancies given below:

| B.Pharmacy | Vacancies - 17 |
|---|---|

Those who have qualified in TGEAPCETB-2026 and secured 45% marks in group subjects (40% for SC/ST/BC candidates only) in qualifying examinations, and also those who have not qualified in TGEAPCETB-2026 also may contact the Principal on or before 06-10-2026 with all necessary original certificates.

**A few Management seats are available in B.Pharmacy Course.**

PRINCIPAL


## గోడ కూలినా.. గోడు పట్టదా!



నూతనకల్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాదకరంగా మారిన శిథిల కట్టడాలపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. కూల్చివేతకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నూతనకల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటన చూసైనా మేల్కొనాల్సిన ఆవశ్యకత ఉంది.

**తప్పిన ముప్పు:** నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంట 15 అడుగుల ఎత్తుతో 50 అడుగుల పొడవు విస్తరించి ఉన్న దుకాణసముదాయం ప్రహరీ శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారింది. పాఠశాల ప్రవేశద్వారానికి ఆనుకొని ఉన్న ఈ గోడ శనివారం ఉదయం విద్యార్థులు రాకముందే ఐదు అడుగుల వెడల్పుతో కూలిపోయింది. తొమ్మిది గంటలు దాటాక కూలితే ఈ ప్రమాదంలో విద్యార్థులు చిక్కుకునేవారని, త్రుటిలో పెను ముప్పు తప్పిందని సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు స్పందించి వెంటనే ప్రాణాంతకంగా మారిన దుకాణ సముదాయం ప్రహరీని ఇంటియజమానులు పూర్తిగా కూల్చివేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంటియజమానిని పిలిపించి ప్రమాదకర గోడను తొలగించి కొత్తగా పటిష్ఠంగా ప్రహరీ నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సునీత 'న్యూస్‌టుడే'కు వివరించారు.

## వాడవాడలా బొడ్డెమ్మ ఆటపాట

సూర్యాపేట సాంస్కృతికం, తుంగతుర్తి, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతిలో మహిళలకు ఉన్న పండగలలో మొదటిది బొడ్డెమ్మ వేడుక. అనాదిగా వస్తున్న సంస్కృతిని భావితరాలకు అందించాలనే ఆలోచనతో మహిళలు సాయంత్రం వేళ గ్రామ కూడళ్లలో నిర్వహిస్తున్నారు. ఇదే తీరున తుంగతుర్తి మండల కేంద్రంలోని వెంపటి రోడ్డులో మహిళలు బొడ్డెమ్మను ప్రతిష్ఠించారు. పుట్టమన్నుతో బొడ్డెమ్మను తయారు చేసి తొమ్మిది రోజులపాటు పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం మహిళల సందడి నెలకొంది. వారు బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడి కోలాటం వేశారు. బాలికలు, యువతలు వారిని అనుసరిస్తూ ఆటపాటల్లో నిమగ్నమయ్యారు.



తుంగతుర్తిలో బొడ్డెమ్మ వేడుకలో పాల్గొన్న మహిళలు

## చిల్డ్రన్ హోమ్‌కు చిన్నారి!

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: సూర్యాపేట చిల్డ్రన్ హోమ్‌కు ఓ మగ శిశువును తరలించినట్లు సమాచారం. తెలిసిన వివరాల ప్రకారం... నాగారం మండలంలో ఓ కుటుంబం మరో కుటుంబానికి మగ శిశువును దత్తత ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై శిశు సంక్షేమ అధికారులకు తెలియడంతో దత్తత తీసుకున్న వారి వద్ద నుంచి శిశువుని తీసుకుని చిల్డ్రర్ హోమ్ తరలించినట్లు తెలిసింది. చట్టప్రకారం చిన్నారిని దత్తత తీసుకోవాల్సి ఉండగా ఇక్కడ ఎలాంటి లీగల్ ప్రొసీజర్ లేకుండానే ఈ వ్యవహారం నడిచినట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఆ శాఖ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వానాకాలం 2026-27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 352 కొనుగోలు కేంద్రాలను గుర్తించినట్లు, మొదటి దశలో 267 కేంద్రాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. మౌలిక వసతులు, తూకం, నాణ్యత పరీక్ష, గన్నీ సంచులు, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా నిల్వ తదితర ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ హరిసింగ్, జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ వి.శ్రీధర్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీవో సురేశ్, సహకార అధికారులు అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
03291-కోదాడ-2 బ్రాంచి
డి.నెం.1-26/8, 1/26/A, సూర్యాపేట రోడ్డు, కోదాడ-508206. Email: ubin0803294@unionbankofindia.bank.in

**ఆస్తులు అమ్మకం కొరకు ప్రకటన**

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 / రూల్ 9 క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 / రూల్ 9 క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది. పైన తెలిపిన ఋణంకు సంబంధించి పైన పేర్కొన్న తేదీలో ఇ-వేలం విక్రయం నిర్వహించబడునని ఋణగ్రహీతలు / హామీదారులకు తెలియజేయడమైనది.

**స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన**

[1] **ఋణగ్రహీత/అప్లికెంట్:** M/s.లక్ష్మీ వెంకట కృష్ణ రైస్ కార్పొరేషన్, డోర్ నెం: 17/190, హుజూర్ నగర్ రోడ్, కోదాడ, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా. తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న దీని భాగస్వాములు: **శ్రీ కొత్తూరు నరసింహారావు, తండ్రి:** అప్పయ్య, కోదాడ (పాలేఅన్నారం గ్రామం, చిలుకూరు మండలం) **(మేనేజింగ్ పార్టనర్), శ్రీమతి కొత్తూరు నాగరాణి, భర్త:** నరసింహారావు, కోదాడ (పాలేఅన్నారం గ్రామం, చిలుకూరు మండలం), **శ్రీ గుండా గురునాథరావు, తండ్రి: శ్రీరాములు,** శ్రీనివాసనగర్, కోదాడ, **శ్రీ గుండా లక్ష్మీ నరసింహారావు, తండ్రి: గురునాథరావు,** శ్రీనివాస నగర్, కోదాడ, **శ్రీ పస్య అనిల్ కుమార్, తండ్రి:** వెంకటరెడ్డి, భవాని నగర్, కోదాడ. [2] **ఋణగ్రహీత/హామీదారు & తనఖాదారు: శ్రీ కొత్తూరు నరసింహారావు, తండ్రి: అప్పయ్య,** ఇంటి నెం.4-103, 4వ వార్డు, గ్రామ పంచాయితీ దగ్గర, నారాయణ పురం, పాలేఅన్నారం, చిలుకూరు మండలం, సూర్యాపేట జిల్లా. తెలంగాణ రాష్ట్రం- పిన్ కోడ్: 508238 (లేదా) **శ్రీ కొత్తూరు నరసింహారావు, తండ్రి: అప్పయ్య,** ఇంటి నెం. 11-4, సర్వే నెం. 1054, 1055 & 1056, ఆజాద్ నగర్, కోదాడ, సూర్యాపేట జిల్లా. తెలంగాణ రాష్ట్రం-పిన్ కోడ్: 508206. [3] **ఋణగ్రహీత/హామీదారు: శ్రీమతి కొత్తూరు నాగరాణి, భర్త: నరసింహారావు,** ఇంటి నెం.4-103, 4వ వార్డు, గ్రామ పంచాయితీ దగ్గర, నారాయణ పురం, పాలేఅన్నారం, చిలుకూరు మండలం, సూర్యాపేట జిల్లా. తెలంగాణ రాష్ట్రం-పిన్ కోడ్: 508238 **(లేదా) శ్రీమతి కొత్తూరు నాగరాణి, భర్త: నరసింహారావు,** ఇంటి నెం. 11-4, సర్వే నెం. 1054, 1055 & 1056, ఆజాద్ నగర్, కోదాడ, సూర్యాపేట జిల్లా. తెలంగాణ రాష్ట్రం- పిన్ కోడ్: 508206. [4] **ఋణగ్రహీత/హామీదారు: శ్రీ గుండా గురునాథరావు, తండ్రి: శ్రీరాములు,** ఇంటి నెం.12-88/1/1/సి, శ్రీనివాస నగర్, కోదాడ, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ-పిన్ కోడ్: 508206. [5] **ఋణగ్రహీత/హామీదారు: శ్రీ గుండా లక్ష్మీ నరసింహారావు, తండ్రి: గురునాథరావు,** ఇంటి నెం.12-88/1/1/సి, శ్రీనివాస నగర్, కోదాడ, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ-పిన్ కోడ్: 508206. [6] **ఋణగ్రహీత/హామీదారు: శ్రీ పస్య అనిల్ కుమార్, తండ్రి: వెంకటరెడ్డి,** ఇంటి నెం.4-89/6/2/7, భవానీ నగర్, కోదాడ, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ-పిన్ కోడ్: 508206 మార్టిగేజీ చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోదాడ 2** బ్రాంచి అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే **"ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే"** మరియు **"యదాతథం"** ప్రాతిపదికపై **13-11-2026 తేదీన మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు (ప్రతి 10 నిమిషాల అపరిమిత పొడిగింపులతో)** విక్రయించబడునని, రుణగ్రహీత, హామీదారు మరియు సహపూచీదారు నుంచి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోదాడ 2** బ్రాంచి కు బకాయిపడిన మొత్తం **రూ.1,02,07,683/- + వడ్డీ + ఇతర ఛార్జీలు** వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించ బడుచున్నవనీ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా **ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీత & తనఖాదారు, హామీదారు** లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. **బయానాను ముందుగాగానీ, అదేరోజుగాని చెల్లించవలెను.**

**సమానమైన తనఖావుంచిన ఆస్తి**

సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణం, ఆజాద్ నగర్‌లోని సర్వే నెం. 1054, 1055 & 1056 లలో ఉన్న ప్లాట్ నెం. 83, ఇంటి నెం. 11-4 కింద ఉన్న 293 చ.గ.ల విస్తీర్ణం కలిగిన నివాస స్థలం మరియు అందులో ప్రస్తుతం ఉన్న గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుల ఆర్.సి.సి శ్లాబ్ భవనంకు సంబంధించిన యావదాస్తి. ఈ **ఆస్తి 22.03.2012 తేదీ గల డాక్యుమెంట్ నెం: 2168/2012 ప్రకారం శ్రీ కొత్తూరు నరసింహారావు, తండ్రి: అప్పయ్య గారికి చెందినది. సరిహద్దులు: ఉత్తరం:** శ్రీమతి పి. రాజ్యలక్ష్మి గారి ఇల్లు, **దక్షిణం:** మున్సిపల్ రోడ్డు, **తూర్పు:** మున్సిపల్ రోడ్డు, **పడమర:** శ్రీ కె. శ్రీనివాస రావు గారి ఇల్లు, డోర్ నెం. 11-3.

రిజర్వుధర : రూ.1,22,00,000/- మరియు డిపాజిట్ చేయవలసిన బయానాసొమ్ము : రిజర్వుధరలో 10%, కనీస బిడ్ పెంపుదల : రూ.1,22,000/-


**వేలం తేదీ మరియు సమయం: 13-11-2026 తేదీన మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు**

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసి ముందస్తు రుణభారాలు: ఏమీ లేదు. అమ్మకం యొక్క పూర్తి నియమాలు మరియు నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే** ప్రొవైడ్ చేయబడిన లింక్ అనగా **https://baanknet.com** మరియు **https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx** మరియు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్ అనగా **https://baanknet.com,** సందేహాల కోసం సంప్రదించవలసిన నెంబర్: **8291220220** & ఈమెయిల్ ఐడి: **support.baanknet@psballiance.com, UBI** బ్రాంచ్ కాంటాక్ట్: బ్రాంచ్ మేనేజర్, శ్రీ యస్‌యస్‌ఎ వెంకటేశ్వరరావు, **9550552323, ubin0803294@unionbankofindia.bank.in**

తేది : 30-09-2026 | సం/- అధీకృత అధికారి,
ప్రదేశము : కోదాడ | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


# పోలీసు అవుతారా..!

### ● నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



సూర్యాపేటలో 2022లో అభ్యర్థులకు పరుగు శిక్షణ ఇస్తున్న పోలీసులు

జిల్లాలో 2022లో శిక్షణకు 400 మంది హాజరవగా 46 మంది ఉద్యోగం పొందారు.
2026లో శిక్షణ: 400
కోదాడలో: 200 మందికి
సూర్యాపేటలో: 200 మందికి

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సై, కానిస్టేబుల్ కొలువుల భర్తీకి ప్రకటన జారీ చేసింది. దరఖాస్తు ప్రక్రియ సైతం పూర్తయ్యింది. ఇప్పటికే కొందరు నిరుద్యోగులు హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో వసతిగృహాల్లో ఉంటూ రూ.వేలలో ఖర్చు చేస్తూ శిక్షణ తీసుకుంటున్నారు. నిరుపేద యువత ఆర్థిక భారంతో శిక్షణ పొందలేకపోతున్నారు. ఇలాంటి వారి కోసం జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. గతంలోనూ శిక్షణను ఎంతోమంది నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకున్నారు.

**ప్రయోజనాలు:** రాత పరీక్షకు అవసరమైన స్టడీ మెటీరియల్‌తోపాటు నిష్ణాతులతో శిక్షణ అందించనున్నారు. దేహదారుఢ్యానికి సంబంధించి పరుగు, లాంగ్, హై జంప్ వంటి వాటిలోనూ తర్ఫీదు ఇస్తారు. దీనికి అర్హులుగా గుర్తించేందుకు తొలుత ఎంపిక పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో అధిక మార్కులు సాధించిన 400 మందికి శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. హాజరయ్యే అభ్యర్థులు రిక్రూట్‌మెంట్ బోర్డుకు సమర్పించి ఉద్యోగ దరఖాస్తు, ఉచిత శిక్షణకు దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకు రావాల్సి ఉంది.

| నేడు జరిగే ప్రవేశపరీక్ష కేంద్రాలు | |
|---|---|
| సూర్యాపేట: | ఎస్వీ డిగ్రీ కళాశాల |
| కోదాడ: | కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల |
| హుజూర్‌నగర్: | గ్రీన్‌వుడ్ పాఠశాల |
| తిరుమలగిరి: | జిల్లా పరిషత్ పాఠశాల |

### సద్వినియోగం చేసుకోవాలి:

– నరసింహ, ఎస్పీ

నిరుపేద నిరుద్యోగ యువతకు జిల్లా యంత్రాంగం, పోలీస్‌శాఖల సమన్వయంతో 45 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నాం. దీనికి రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకోవాలి. ద్విచక్ర వాహనాలపై వచ్చే వారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలి.

## డెస్క్ బల్ల.. నాణ్యత డొల్ల

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థినుల సౌకర్యార్థం తెచ్చిన డెస్క్‌లు అనతి కాలంలోనే చెడిపోయాయి. కూర్చోవడానికి, వీపు ఆనుకోవడానికి ప్లైవుడ్ షీట్లు పెట్టారు. అవి నాసిరకంగా ఉండటంతో కొద్ది రోజుల్లోనే పూర్తిగా పాడైపోయాయి. కనీసం కూర్చోవడానికి వీలులేకుండా తయారయ్యాయి. దీంతో చేసేది లేక ఇనుప బల్లలను భవనం పైన వృథాగా పడేశారు. రూ.లక్షల విలువ చేసే స్టాండ్లు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టిపోతున్నాయి. వృథాగా పడేసిన ఇనుప స్టాండ్లకు రంగు వేయించి, కొత్త ప్లైవుడ్ షీట్లను అమరిస్తే అవి ఉపయోగంలోకి వచ్చి వందల మంది విద్యార్థినులకు ఉపయోగపడతాయి.

● ఈ విషయమై ఇటీవల గురుకులానికి వచ్చిన ప్రాంతీయ సమన్వయాధికారి శ్రీనివాస్‌రాయ్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలో వాటిని బాగు చేయించి ఉపయోగించుకునేలా చేస్తామన్నారు.

